# 'సలార్'.. ఓ భావోద్వేగ ప్రయాణం



**''సలార్' చిత్రంలో యాక్షన్‌తో పాటు హృదయాన్ని కదిలించే ఎమోషన్స్ ఉంటాయి. ఈ తరహా పాత్ర నేను ఇప్పటివరకు చేయలేదు. నా కెరీర్‌లో ఇదొక విభిన్నమైన చిత్రం' అన్నారు అగ్ర హీరో ప్రభాస్. ఆయన కథానాయకుడిగా ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో హోంబలే ఫిల్మ్స్ సంస్థ తెరకెక్కించిన పాన్ ఇండియా చిత్రం 'సలార్' ఈ నెల 22న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా ప్రభాస్ సినిమా తాలూకు ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు.**

'సలార్' ప్రేక్షకులకు అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తుంది. పాత్రల మధ్య చక్కటి భావోద్వేగాలు ఉంటాయి. నన్ను ఇప్పటివరకు చూడనటువంటి పాత్రలో చూస్తారు. ప్రశాంత్‌నీల్‌తో సినిమా అనుకున్నప్పుడు.. నా మైండ్‌లో ఉన్న ఆలోచనలను అతని ముందుంచాను. అందరికి రీచ్ అయ్యేలా సినిమా ఉండాలని చర్చించాం. నా ఐడియాస్‌లో కొన్ని ప్రశాంత్‌కు నచ్చాయి. ఇద్దరం కలిసి వర్క్‌షాప్స్ చేశాం. ఎలాంటి ఒత్తిళ్లు లేకుండా సరదాగా షూటింగ్ జరిగింది. షూటింగ్ ఆరంభమైన నెలరోజుల్లోనే మేమిద్దరం మంచి స్నేహితులమయ్యాం.

### ఫిట్‌గా తయారయ్యాను

దర్శకుడు ప్రశాంత్‌నీల్ హీరోలను గొప్పగా చూపించాలని తపిస్తాడు. ఈ సినిమాలో నా పాత్రను కూడా పవర్‌ఫుల్‌గా తీర్చిదిద్దాడు. ఈ పాత్ర కోసం నేను ప్రత్యేకంగా కష్టపడలేదు. క్యారెక్టర్ డిమాండ్ మేరకు కాస్త కండలు పెంచాలని దర్శకుడు చెప్పారు. ఆయన కోరుకున్నట్లుగా ఫిట్‌గా తయారయ్యాను. ఈ సినిమాలో రెండు పాత్రల మధ్య చక్కటి సోదర భావం కనిపిస్తుంది. సినిమా వ్యవధి 2 గంటల 55 నిమిషాలు ఉంటుంది. యాక్షన్ ఘట్టాలు అభిమానులకు కొత్త అనుభూతిని అందిస్తాయి.

# ఇద్దరు స్నేహితుల కథ

అగ్ర హీరో నాగార్జున నటిస్తున్న తాజా చిత్రం 'నా సామిరంగ'లో అల్లరి నరేష్ కీలక పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. విజయ్ బిన్ని దర్శకుడిగా పరిచమయవుతున్న ఈ చిత్రాన్ని మాస్, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నారు. చాలా కాలం విరామం తర్వాత నాగార్జున నటిస్తున్న పక్కా మాస్ సినిమాగా అభిమానుల్లో అంచనాలు పెంచుతున్నది. శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్స్ పతాకంపై శ్రీనివాస చిట్టూరి నిర్మిస్తున్న ఈ చిత్రం సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకురానుంది. శుక్రవారం అంజి పాత్రలో అల్లరి నరేష్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. పల్లెటూరి నేపథ్యంలో ఇద్దరి మధ్య స్నేహబంధాన్ని ఆవిష్కరిస్తూ గ్లింప్స్ ఆకట్టుకుంది. సినిమాలో వీరిద్దరి మధ్య అనుబంధం ప్రధానాకర్షణగా నిలుస్తుందని, త్వరలో టీజర్‌ను విడుదల చేస్తామని మేకర్స్ ప్రకటించారు. ఆషికా రంగనాథ్, అల్లరి నరేష్, కరుణకుమార్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: దాశరథి శివేంద్ర, సంగీతం: ఎం.ఎం.కీరవాణి, కథ, మాటలు: ప్రసన్నకుమార్ బెజవాడ, దర్శకత్వం: విజయ్ బిన్ని.



నాగార్జున, అల్లరి నరేష్



# తప్పుతెలుసుకొని బాధపడ్డాను

**ఇటీవల** ముంబయిలో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న యువ కథానాయిక జాన్వీకపూర్ తన తల్లి దివంగత శ్రీదేవిని తలచుకొని భావోద్వేగానికి గురైంది. తొలి చిత్రం 'ధడక్' షూటింగ్ సమయంలో అమ్మను లొకేషన్‌కు రావొద్దని చెప్పానని, తన నిర్ణయం తప్పని కొంతకాలానికి అర్థం చేసుకున్నానని ఆవేదన వ్యక్తం చేసింది. ప్రస్తుతం ఈ భామ హిందీతో పాటు దక్షిణాదిలో కూడా సత్తా చాటడానికి సిద్ధమవుతున్నది. ఎన్టీఆర్ 'దేవర' చిత్రం ద్వారా తెలుగులో అరంగేట్రం చేస్తున్నది. జాన్వీకపూర్ మాట్లాడుతూ 'మా అమ్మకు ఉన్న పేరుప్రతిష్టల కారణంగానే నాకు అవకాశాలు వస్తున్నాయని అందరూ అనుకునేవారు. అందుకే అమ్మను షూటింగ్ లొకేషన్‌కు రావొద్దని చెప్పాను. వారసత్వం తాలూకు ఎలాంటి ఛాయలు లేకుండా నా సొంతంగా ఎదగాలని ప్రయత్నించాను. అదే సమయంలో నాలో ఏదో తెలియని అభద్రతాభావం ఉండేది. అంచనాలను అందుకోవాలనే ప్రయత్నంలో ఒత్తిడికి గురయ్యేదాన్ని. అమ్మ ఎలాంటి సలహాలు ఇచ్చిన తీసుకునేదాన్ని కాదు. కొంతకాలం గడిచాక నా నిర్ణయాలు తప్పని తెలుసుకొని బాధపడ్డాను. ఇప్పుడు అమ్మ ఉంటే తనను షూటింగ్‌కు పిలిచి ఆనందంగా ఎన్నో విషయాలను పంచుకోవాలనిపిస్తున్నది. శ్రీదేవి కూతురిగా పుట్టినందుకు గర్విస్తున్నా' అని జాన్వీకపూర్ చెప్పింది. 'దేవర' చిత్రంలో జాన్వీకపూర్..తంగమ్ అనే గ్రామీణ యువతి పాత్రలో కనిపించనుంది.



# తెలియని విషయాలను చూపించాం

రామ్‌గోపాల్‌వర్మ దర్శకత్వంలో రూపొందిన తాజా చిత్రం 'వ్యూహం. ఏపీ ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్ రెడ్డి జీవితంలో జరిగిన కొన్ని సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. అజ్మల్, మానస జంటగా నటించారు. రామదూత క్రియేషన్స్ పతాకంపై దాసరి కిరణ్ కుమార్ నిర్మించారు. ఈ నెల 29న విడుదలకానుంది. ఈ సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ మాట్లాడుతూ 'ఈ సినిమాలో వైయస్ రాజశేఖర్ రెడ్డి మరణం మొదలు జగన్ అరెస్ట్, ఆ తర్వాత కొన్నేళ్లకు సీఎం కావడం, వైఎస్ వివేకా హత్య వంటి ముఖ్య సంఘటనలు ఉంటాయి. ప్రజలకు తెలియని కొన్ని విషయాలను ఈ సినిమా ద్వారా తెలియజెప్పాం. ఇందులో పవన్‌కల్యాణ్, చంద్రబాబు నాయుడు పాత్రలు కూడా ఉంటాయి. అయితే వారి నిజ జీవితానికి ఏమాత్రం సంబంధం ఉండదు. నేను రాజకీయాల్లో లేకున్నా అక్కడ వ్యక్తులు ఎలా ప్రవర్తిస్తారనే విషయంపై పూర్తి అవగాహన ఉంది. ఇక వ్యక్తిగతంగా మాత్రం రాజకీయాల్లోకి రావాలనే ఆలోచన ఏమాత్రం లేదు' అన్నారు. రామ్‌గోపాల్‌వర్మను ఎవరూ డబ్బులతో కొనలేరని, వెలకట్టలేని వ్యక్తిత్వం ఆయన సొంతమని నిర్మాత దాసరి కిరణ్ కుమార్ ప్రశంసించారు.

'ఉప్పెన' చిత్రంతో తెలుగులో అరంగేట్రం చేసిన మంగళూరు సోయగం కృతిశెట్టికి..ఆ తర్వాత చేసిన సినిమాలేవీ కలిసి రాలేదు. అయితే తమిళంలో మాత్రం సత్తా చాటుతున్నది. తాజాగా ఈ భామ అక్కడ భారీ అవకాశాన్ని దక్కించుకుంది. 'లవ్ టుడే' ఫేమ్ ప్రదీప్ రంగనాథ్‌తో కలిసి ఓ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌లో నటించబోతున్నది. అగ్ర దర్శకుడు విఘ్నేష్ శివన్ డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమాకు 'లవ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. గురువారం చెన్నైలో ఈ సినిమా ప్రారంభమైంది. త్వరలో రెగ్యులర్ షూటింగ్ మొదలుకానుంది. ఈ సినిమా తన కెరీర్‌లో ప్రత్యేకమని, పూర్తి స్థాయి ప్రేమకథా చిత్రంలో నటించడం ఆనందంగా ఉందని కృతిశెట్టి చెప్పింది. రామ్ నటించిన 'ది వారియర్' చిత్రంతో తమిళ చిత్రసీమలో ఎంట్రీ ఇచ్చిన కృతిశెట్టి అక్కడ చక్కటి అవకాశాలను అందిపుచ్చుకుంటున్నది. కార్తి, జయం రవి వంటి అగ్ర హీరోల చిత్రాల్లో కథానాయికగా నటిస్తున్నది.

# ప్రేమకు ఇన్సూరెన్స్!





రోషన్, మానస చౌదరి

# ఏం రాసిపెట్టుందో తెల్వదు..

రోషన్ కనకాల కథానాయకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'బబుల్‌గమ్'. రవికాంత్ పేరేపు దర్శకుడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, మహేశ్వరి మూవీస్ సంస్థలు నిర్మిస్తున్నాయి. ఈ నెల 29న విడుదల కానుంది. శుక్రవారం థియేట్రికల్ ట్రైలర్‌ను ఆవిష్కరించారు. ఈ వేడుకలో దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు, అనిల్ రావిపూడి, హీరో రానా ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. 'నా నసీబ్ ఏం రాసి పెట్టుందో నాకు తెల్వదు..కానీ నచ్చినట్లు మార్చుకుంటా. కావాల్సింది లాక్కొని తెచ్చుకుంటా..అది ఇజ్జత్ అయినా..ఔకాత్ అయినా' అనే పవర్‌ఫుల్ డైలాగ్‌తో మొదలైన ట్రైలర్ ఆద్యంతం ఆసక్తిని పంచింది. హీరో రోషన్ కనకాల లీడ్ పాత్రలో కనిపించాడు. ప్రేమలో విఫలమైన అతను తన ప్రతిభను ప్రపంచానికి తెలియజెప్పాలనే లక్ష్యాన్ని ట్రైలర్‌లో ఆవిష్కరించారు. ఈ సినిమా ట్రైలర్‌లోనే సూపర్‌హిట్ కళ కనిపిస్తున్నదని కె.రాఘవేంద్రరావు ప్రశంసించారు. యువత మెచ్చే అన్ని అంశాలున్నాయని దర్శకుడు అనిల్ రావిపూడి తెలిపారు. ట్రైలర్‌ను రాఘవేంద్రరావు లాంచ్ చేయడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని హీరో రోషన్ పేర్కొన్నాడు. దర్శకుడు మాట్లాడుతూ 'ట్రైలర్ కంటే సినిమా ఇరవైరెట్లు ఉత్సాహాన్నిస్తుంది. చక్కటి వినోదంతో అలరిస్తుంది. శ్రీచరణ్ పాకాల అద్భుతమైన సంగీతాన్నందించారు' అన్నారు. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ఇదని, తప్పకుండా అందరికి నచ్చుతుందని నిర్మాత వివేక్ కూచిభొట్ల తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.



# శ్రీవారి సేవలో దీపికా పడుకోన్

**బాలీవుడ్ అగ్రనటి దీపికా పడుకోన్ శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అలిపిరి మెట్ల మార్గం ద్వారా ఆమె కాలినడకన కొండపైకి చేరుకున్నారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆమెకు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ప్రస్తుతం దీపికా పడుకోన్ తెలుగులో ప్రభాస్ సరసన 'కల్కి' చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే.**

# నేల మీద నేనున్నా..



సోహైల్, వినాయక్ దేశాయ్

వినాయక్ దేశాయ్, అపర్ణా దేవి జంటగా నటిస్తున్న చిత్రం 'రాధా మాధవం'. దాసరి ఇస్సాకు దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని గోనాల వెంకటేష్ నిర్మించారు. చిత్రీకరణ పూర్తయింది. ఈ నెలలోనే విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సినిమాలోని 'నేల మీద నేనున్నా' అనే గీతాన్ని ఇటీవల బిగ్‌బాస్ ఫేమ్ సోహైల్ విడుదల చేశారు. కొల్లి చైతన్య స్వరపరచిన ఈ పాటను మహాలింగం, మానసి ఆలపించారు. వసంత్ వెంకట్ రచించారు. గ్రామీణ నేపథ్యంలో నడిచే ప్రేమకథా చిత్రమిదని, వినూత్న కథాంశంతో ఆకట్టుకుంటుందని దర్శకుడు తెలిపారు. మేక రామకృష్ణ, జయప్రకాష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: తాజ్ జీడీకే. సంగీతం: చైతు కొల్లి, కథ, మాటలు, పాటలు: వసంత్ వెంకట్ బాలా, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: దాసరి ఇస్సాకు.



# డార్క్ థ్రిల్లర్ 'రుధిరాక్ష' ప్రారంభం

ఆది సాయికుమార్ హీరోగా సీనియర్ నటులు జేడీ చక్రవర్తి, సత్యరాజ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'రుధిరాక్ష' శుక్రవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. శివశంకర్ దేవ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని రాజు జువ్వల నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి ప్రముఖ దర్శకుడు సముద్రఖని క్లాప్‌నివ్వగా, రామ్ తాళ్లూరి కెమెరా స్విఛాన్ చేశారు. 'డార్క్ థ్రిల్లర్ కథాంశమిది. ఉన్నత సాంకేతిక విలువలతో తెరకెక్కించబోతున్నాం. త్వరలో రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభిస్తాం' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: కిషోర్ బోయిదాపు, సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, మాటలు: పవన్ హిమాన్షు, బాలు మహేంద్ర, నిర్మాణ సంస్థ: 9స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్, రచన–దర్శకత్వం: శివశంకర్ దేవ్.

# సందేశంతో 'సర్కారు నౌకరి'



ఆకాష్, భావన

సింగర్ సునీత కుమారుడు ఆకాష్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'సర్కారు నౌకరి'. గంగనమోని శేఖర్ దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రాన్ని రాఘవేంద్రరావు నిర్మిస్తున్నారు. భావన కథానాయిక. జనవరి 1న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా శుక్రవారం కొత్త స్టిల్‌ను విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'సామాజిక సమస్యలను చర్చిస్తూ ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. వినోదంతో పాటు చక్కటి సందేశం కూడా ఉంటుంది. నేటి యువతకు కనెక్ట్ అయ్యే అన్ని అంశాలుంటాయి. ఇప్పటికే విడుదల చేసిన టీజర్, పాటలకు మంచి స్పందన లభిస్తున్నది' అన్నారు. తనికెళ్ల భరణి, రమ్య పొందూరి, సత్యసాయి శ్రీనివాస్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: శాండిల్య, సినిమాటోగ్రఫీ, రచన, దర్శకత్వం: గంగనమోని శేఖర్.